క్లుప్తంగా

ప్రతిభ విద్యార్థులకు నగదు పురస్కారాలు

మదనపల్లె సిటీ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు స్థానిక సీటీఎం రోడ్డులోని ది సిటిజెన్ కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు వారు నగదు పురస్కారాలు అందజేశారు. బుధవారం బ్యాంకు కార్యాలయంలో బ్యాంకు షేర్ హోల్డర్స్ విద్యార్థులు టి.విశాల్, కెభవ్య, టి.వర్షితలకు రూ.10వేల నగదు, ప్రశంసాపత్రాలను బ్యాంకు రీజనల్ మేనేజర్ లోకనాథనాయుడు అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచు మేనేజర్ చిరంజీవి,సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాపరికరాలు వితరణ

మదనపల్లె సిటీ : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు పుణ్యవతి, వసుధ, మోహన్‌రావులు విద్యార్థులకు క్రీడాపరికరాలు వితరణ చేశారు. వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఒత్తిడికి దూరమై శారీరకంగా దృఢత్వం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరచాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కృష్ణవేణి ఎంపిక

వాల్మీకిపురం : మండలంలోని యర్రగుంట్లబావి ఎంపీపీ పాఠశాలలో పని చేస్తున్న కృష్ణవేణి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా గుర్తించి అవార్డుకు ఎంపికైనట్లు కడప జడ్పీ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. ఈ అవార్డును గురువారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కడప జెడ్పీ కార్యాలయంలో అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా భాస్కర్‌రెడ్డి

బి.కొత్తకోట : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో గణితం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డి.భాస్కర్‌రెడ్డి రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. గణిత ఉపాధ్యాయుడుగా విద్యార్థులకు మెరుగైన బోధన, పరీక్షల్లో వందశాతం ఫలితాల సాధనలో ఆయన కృషికి అవార్డుకు ఎంపిక చేశారు.

పారదర్శకంగా పథకాలు అందించాలి

కేవీపల్లె : ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు పారదర్శకంగా అందించాలని ఈవోపీఆర్‌డీ ఎస్.ఎ. గఫూర్ అన్నారు. బుధవారం మండలంలోని తువ్వపల్లె గ్రామ సచివాలయాన్ని ఆయన తనఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి విజయవంతం చేయాలని సూచించారు.

భూ సమస్య పరిష్కరించాలని నిరసన

మదనపల్లె : కొనుగోలు చేసిన భూమిలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని బాధితులు స్థలం ఎదుటే నిరసన తెలిపిన ఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని 150వమైలుకు సమీపంలో జాతీయరహదారికి ఆనుకుని రెండు కుంటల స్థలాన్ని హక్కుదారులైన దేవముని, రాజమ్మలు తమకు విక్రయించి అగ్రిమెంట్ రాసిచ్చారని కల్యాణ్‌నాయుడు, షాకీనా తెలిపారు. సదరు స్థలంలో తాము నిర్మాణాలు చేసేందుకు వెళితే... తమకు స్థలాన్ని విక్రయించిన హక్కుదారుల బంధువులైన ప్రసాద్, భారతి, కిషోర్ అడ్డుకుంటున్నారని వాపోయారు. దీనిపై పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశామన్నారు.

ఇస్కాన్ భోజనం భేష్

పీలేరు రూరల్ : ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్నం సరఫరా చేస్తున్న ఇస్కాన్ భోజనం బాగుందని ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి అన్నారు. బుధవారం చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ వద్ద ఇస్కాన్ వంటశాలను సందర్శించారు. భోజనం తయారీ, వంటలకు ఉపయోగిస్తున్న వస్తువులు, కూరగాయాలు నాణ్యత పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తయారీదారులకు పలు సూచనలు చేశారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

వాల్మీకిపురం : శ్రీ షిరిడిసాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 115 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వీరిలో 25 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్ సాయిలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, క్రిష్ణమూర్తి, మదనమోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ శెట్టి, సత్యా, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు

రామసముద్రం : ఎరువులు, మందులు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామని మదనపల్లె వ్యవసాయశాఖ ఏడీ దీక్షకుమారి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎరువులు, పురుగుల మందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. యూరియా, అన్ని రకాల ఎరువులు ఎంఆర్పీ ధరలకే విక్రయించాలని ఆదేశించారు. ఎరువులను బయోమెట్రిక్ తీసుకుని విక్రయించాలని, అలాగే తప్పకుండా రశీదు ఇవ్వాలని సూచించారు.

ఈ-క్రాప్‌తో రైతుకు భరోసా

- పంట నష్టపోతే పరిహారం అందే అవకాశం
- కౌలు రైతులకు పరిహారం వర్తింపు
- పంట నమోదుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



నగరిలో రైతుల పొలాల్లో సాగుచేసిన పంటలపై ఈ-క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు

గుర్రంకొండ : ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్న రైతులకు ఈ-క్రాప్ నమోదుతో ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. పంటలు నష్టపోతున్న రైతులకు ఈ- క్రాప్ వరంగా మారుతోంది. ప్రస్తుతం ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా ఈ -క్రాప్ నమోదు ప్రక్రియ చేపట్టారు. సాగులో అన్ని రకాల పంటల వివరాలను నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఈ ప్రక్రియ గత నెలరోజులుగా ముమ్మరంగా సాగుతోంది. పంటల సాగు వివరాలు నమోదు చేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు తాము పండించిన పంటలు నష్టపోతే ప్రభుత్వం సాయం అందించడానికిగానూ వీలుంటుంది. సాధారణ రైతులతో పాటు కౌలురైతులకు పంటనష్టపరిహారం అందనుండడం గమనార్హం.

రైతుల నేరుగా బీమా ప్రయోజనం:

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటసాగు చేసి నష్టపోయిన రైతులకు నేరుగా నష్టపరిహారం పొందే వెసులు బాటు ఉంటుంది. దళారుల చేతికి బీమా పరిహారం అందదు. ప్రభుత్వమే పూర్తిస్థాయిలో రైతుల తరపున బీమా సొమ్ము చెల్లిస్తోంది. దీంతో పంట నష్టపోయినప్పుడు గతంలో ఈ క్రాప్ ద్వారా నష్టపోయిన రైతు ఎంత మేరకు పంట సాగు చేశాడో వివరాలు తెలుస్తాయి. అలాగే పంట మార్పిడికి వీలుంటుంది. పంటల వివరాల ఆధారంగా ఉత్పత్తుల లభ్యతపై స్పష్టత వచ్చే అవకాశముంటుంది. పైగా దిగుబడుల అంచనాకు ఇది సరైన విధానం. ఎరువులు, పురుగుల మందులు, ఎంతమేరకు అవసరం ఆవుతాయో ఆయా పరిధిలోని ఆర్‌బీకేలకు తెలిసే అవకాశముంది.

రైతులకు ప్రభుత్వం ఆసరా:

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులకు ఆర్‌బీకేల ద్వారా విత్తనాల, ఎరువులు అందుబాటులోకి తెచ్చింది ప్రభుత్వం.ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రతి రైతు పంటలు సాగు చేసుకొనేందకుగానూ ప్రభుత్వం రైతు భరోసా కింద రూఈ 7500 నగదు జమ చేసింది. ఇప్పటికే పలుచోట్ల ఆర్‌బీకేలకు సబ్సీడీ ఎరువులు సరఫరా అయ్యాయి. రైతులకు అందుబాటులోకి సబ్సీడీ ఎరువులు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతులకు పరిహారం:

గత ప్రభుత్వాలలో ఎన్నడూ లేని విధంగా గత నాలుగేళ్లుగా ప్రస్తుత ప్రభుత్వం కౌలురైతులకు పంట నష్టపరిహారం అందిస్తుండడం గమనార్హం. గతంలో పొలాన్ని కౌలురైతులు కౌలుకు తీసుకొన్నా పంట నష్టపరిహారం మాత్రం యజమానులకే అందేది. ప్రస్తుతం ఒకసారి కౌలురైతుల గుర్తింపు కార్డులు జారీచేస్తే ఈ క్రాప్ నమోదులో ఆన్‌లైన్ సదరు పొలం కౌలు రైతులకు ఇచ్చినట్లు చూపిస్తోంది. దీంతో పొలం యాజమానులకు కాకుండా నిజమైన కౌలురైతుల పేరు మీదే ఈక్రాప్ నమోదు చేస్తుండడం గమనార్హం. దీంతో పంట నష్టపరిహం కౌలు రైతులకు నేరుగా అందనుంది.

ఈ క్రాప్ నమోదు, పంట విస్తీర్ణం

నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ, టమాటా, కంది, పెసర, సజ్జ,అలసంద, వరి,పూలు, కూరగాయల పంట సాగు విస్తీర్ణం, ఈ క్రాప్ నమోదు పూర్తి చేసిన శాతం వివరాలు ఇలా..

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈ-క్రాప్ నమోదు (ఎకరాల్లో)
గుర్రంకొండ	6938	6870
పీలేరు	13584	13285
వాల్మీకీపురం	9254	9087
కలికిరి	10120	9868
కేవిపల్లె	10650	10384
కలకడ	5486	5267

98 శాతం పంట నమోదు :

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఈ- క్రాప్ నమోదు ప్రక్రియ 98 శాతం వరకు పూర్తి అయ్యింది. నియోజకవర్గంలో అన్ని రకాల పంటల సాగు మొత్తం విస్తీర్ణం 56032 ఎకరాలు ఉంది. ఇందులో ఇప్పటివరకు 54761ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి అయ్యింది.

ప్రభుత్వమే బీమా చెల్లింపు



ఈక్రాప్ నమోదుతో మాకు ఎంతో మేలు జరుగుతోంది. ఈక్రాప్ నమోదు చేయడానికి ఆర్బీకే సిబ్బంది మా పొలాల వద్దకే వచ్చారు. బీమా సొమ్ము చెల్లించక పోయినా ప్రభుత్వమే రైతుల తరపున బీమా సొమ్ము చెల్లించడం ఆనందంగా ఉంది. పంటలు నష్టపోతే ఎవరి చుట్టూ తిరగకుండా ప్రభుత్వమే తమను ఆదుకొంటోంది. – గోపాల్, సుంకరవాండ్లపల్లె

కౌలు రైతులకు న్యాయం



గతంలో ఎన్నడూ లేనివిధంగా కౌలు రైతులకు ఈక్రాప్ ద్వారా న్యాయం జరిగింది. తాము సాగుచేసిన పంటను పరిశీలించి పంట నమోదు చేస్తున్నారు. తద్వారా అర్హులైన కౌలు రైతులందరికి న్యాయం జరుగుతోంది. పంటనష్టం సంభవిస్తే నేరుగా కౌలు రైతులకే పంట నష్టపరిహారం ఇస్తున్నారు. – నరేంద్ర, కౌలురైతు, దౌలత్‌ఖాన్‌పల్లె

ఈ క్రాప్‌తో రైతులకు ప్రయోజనం



ఈ క్రాప్ నమోదు చేసుకోవడం వలన రైతులకు ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా రైతు భరోసా, పంట నష్టపరిహారం తప్పనిసరిగా రైతులకు అందుతాయి. ముఖ్యంగా కౌలు రైతులకు కుడా రైతు భరోసాతో పాటు పంట నష్టపరిహారం కూడా అందుతుంది. రైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – రత్నమ్మ, వ్యవసాయాధికారిణి, గుర్రంకొండ

నాడు-నేడు పనులు వెంటనే పూర్తి చేయండి

– డీఈఓ పురుషోత్తం

కలకడ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం ఆదేశించారు. బుధవారం మండలంలోని కె.బాటవారిపల్లె జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని, పనులు పూర్తి చేయగానే నిధులు విడుదల చేస్తారన్నారు. పాఠశాలలో రికార్డులు తనిఖీ చేసి ప్రగతి పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ మునీంద్ర నాయక్, క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు సరస్వతిరెడ్డి, ఉపాధ్యాయులు, ఎంఆర్పీలు పాల్గొన్నారు.

అండమాన్ నికోబార్‌కు ములకలచెరువు టమాట



రవాణాకు సిద్ధంగా టమాటాలు

ములకలచెరువు : ములకలచెరువు మండల పరిసర ప్రాంతాల నుంచి కొందరు వ్యాపారస్తులు టమాటాలను కొనుగోలు చేసి చెన్నై మీదుగా షిప్‌ల ద్వారా అండమాన్ నికోబార్‌కు ఎగుమతి చేస్తున్నారు. వ్యాపారస్తులు స్థానికులే కావడంతో తోటల వద్దకు వెళ్లి ఊజీగ కొట్టని, మచ్చలు లేని కాయలను ఎంపిక చేసి పచ్చి టమోటాలను తరలిస్తున్నారు. ఇక్కడ నుంచి అండమాన్ నికోబార్‌కు రవాణా సుమారుగా ఐదు రోజులు పడుతుందని వ్యాపారస్తులు చెబుతున్నారు. ములకలచెరువు పరిసర ప్రాంతాల్లో పలు తోటలను పరిశీలించి పచ్చి టమాట కాయలను కొనుగోలు చేసి బుధవారం 15 టన్నుల కాయలను తరలించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరల కంటే 30 కేజీల టమాట క్రేటు రూ. 100 ఎక్కువగా పెట్టి నాణ్యమైన కాయలను కొనుగోలు చేస్తున్నామని వ్యాపారస్తులు అంటున్నారు.

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు : తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ నాయకులు ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పోస్టాఫీసు వద్ద తపాలా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. టార్గెట్ల కోసం జీడీఎస్‌లను వేధించడం, ఒత్తిడి చేయడం ఆపివేయాలన్నారు. గ్రాట్యుటి రూ. 5 లక్షలకు పెంచాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వాల్మీకిపురం : ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక నాలుగురోడ్ల కూడలిలో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోలకు స్టిక్కరింగ్, పోలీస్ నెంబరు, ఇన్సూరెన్స్, ట్యాక్స్, పొల్యూషన్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనల మేరకు వాహనాలు నడపాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఆటోలో ప్రయాణిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

కురబలకోట : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని మహిళ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ధనలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె కురబలకోట అంగన్‌వాడీ కేంద్రాలలో జరిగిన సంకల్ప సప్తాహ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శారీరక, మానసిక ఎదుగుల సక్రమంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారం అవసరమన్నారు. ఎంపీడీఓ దిలీప్‌కుమార్, కురబలకోట తొలి మహిళా సర్పంచ్ సుక్కా సుజాత, కార్యదర్శి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

జేసీ పర్హాన్ అహమ్మద్‌ఖాన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ పర్హాన్ అహమ్మద్‌ఖాన్

కలకడ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పర్హాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని కె.బాటవారిపల్లె ప్రభుత్వ ఉన్నాత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని సమస్యలపై ప్రజలు అందించిన దరఖాస్తులను స్వీకరించారు. ప్రభుత్వం నేరుగా ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి జగనన్నకు చెబుదాం కోసం ఉచిత టోల్‌ఫ్రీ నెంబర్ 1902ను నిత్యం అందుబాటులో ఉంచిందని గుర్తు చేశారు. ప్రతి ఫిర్యాదుకు సమస్య పరిష్కారం అయ్యేవరకూ సమన్వయం చేయడానికి అధికారుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. రెవెన్యూ పరిధిలోని భూమి సమస్యలు, ఆక్రమణలపై నిత్య ఫిర్యాదులు అధికంగా అందుతున్నాయన్నారు. వాటి పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ చూపాలని తహసీల్దార్ ప్రదీప్‌ను ఆదేశించారు. ఎంపీపీ శ్రీదేవి, సింగిల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డిలు బాహుదానదిపై బ్రిడ్జి దెబ్బతినిందని, అలాగే ఆర్టీసి బస్టాండ్‌లో కనీసం మంచి నీటి, టాయిలెట్స్ సౌకర్యం లేదని తెలిపారు. ప్రయాణికులు, మహిళా కండక్టర్లు సైతం మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే పీలేరు డిపో మేనేజర్‌కు ఫోన్‌చేసి కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇంటి పట్టాల మంజూరు, పంపిణీ వెంటనే జరగాలని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎండీయూ ఆపరేటర్లు రాజీనామా చేయడంతో కె.బాటవారిపల్లె, గంగాపురం రెండు పంచాయతీలలో ప్రభుత్వ చౌకబియ్యం సకాలంలో కార్డుదారులకు అందడం లేదని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి రంగస్వామి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడతాం

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జె.రాజారెడ్డి



మాట్లాడుతున్న జె.రాజారెడ్డి

మదనపల్లె : కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను పోరాటాల ద్వారా తిప్పికొడదామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జె.రాజారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎస్టీయూ రెడ్డిభవన్‌లో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు సరోజమ్మ అధ్యక్షతన అన్నమయ్యజిల్లా ఆఫీస్‌బేరర్స్, అనుబంధ సంఘాల జిల్లానాయకులు, పట్టణ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జె.రాజారెడ్డి మాట్లాడుతూ...దేశంలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యహక్కులను, రాజ్యాంగహక్కులను కార్మికహక్కులను కాలరాస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సిద్ధిగాళ్ల శ్రీనివాసులు, పి.ఎల్.నరసింహులు, లీలావతి, గంగాధర్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మస్తాన్‌వలీ దర్గాలో బులంద్ దర్వాజా ప్రారంభం



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సయ్యద్‌షా ఆరీఫుల్లాహుస్సేని, ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : దేశంలో ప్రముఖ సూఫీ పుణ్యక్షేత్రమైన వైఎస్సార్ జిల్లా కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేని, ఎమ్మెల్యే నవాజ్‌బాషా బుధవారం మదనపల్లె కోటవీధి మస్తాన్‌వలీ దర్గాలో దర్గాలో బులంద్ దర్వాజా ప్రారంభించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్ బాషా పీఠాధిపతిని సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్విత దైవంగా మస్తాన్‌వలీ బాబా ప్రజల మనస్సుల్లో నిలిచారన్నారు. రాజస్థాన్ అజ్మీర్‌షరీఫ్‌లోని ఖాజాగరీబున్ నవాజ్ బులంద్ దర్వాజా నమూనాను తీసుకుని కోటవీధి మస్తాన్‌వలీ దర్గాలో నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ ప్రెసిడెంట్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, ఎస్.ప్యారేజాన్, జి.సాదిక్, రిటైర్డ్ ఎస్ఈ షరీఫ్ సాబ్, సాద్‌బాషా, జమాల్‌బాషా, ఆబిద్‌హుస్సేన్, ఎస్.బాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్ బి.ఏ.ఖాజా, వసీం, గుండ్లూరు రఫీ, షరీఫ్, రహీం తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే నవాజ్‌బాషా




సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : అనారోగ్యంతో బాధపడుతున్న పేదల కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న సీఎం సహాయనిధి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి చెక్కులను అందజేశారు. మండలంలోని పోతబోలు శాంతినగర్‌కు చెందిన జాన్‌సుధీర్‌కు రూ.2లక్షల 50వేలు, వలసపల్లెకు చెందిన ఆర్.సి.ప్రసాద్‌కు రూ.1లక్ష 40వేలు, వెంకటేష్‌పురంకు చెందిన కే.రెడ్డిశేఖర్‌కు రూ.80 వేలు, పట్టణంలోని చౌడేశ్వరినగర్‌కు చెందిన పి.కీర్తికి రూ.3 లక్షలకు సంబంధించి మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి అత్యుత్తమ వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీలో వైద్యసేవలను పెంచడమే కాకుండా నాణ్యమైన వైద్యం కోసం పేదవాడు రూపాయి ఖర్చు చేయనవసరం లేకుండా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్యసంరక్షణకి పెద్దపీట వేస్తున్న సీఎం వైఎస్.జగన్‌కు ప్రజలందరూ మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్వీ.రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, బండిమనోహర్, ఆంజనేయులు, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ గౌడసానివెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎం ప్రాధాన్యత

- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు
- ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



పెద్దతిప్పసముద్రం : జగనన్న ఆరోగ్యసురక్ష కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం : పేదల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. బుధవారం మండలంలోని బూర్లపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉచిత సేవలపై రోగుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స అందించేలా ప్రభుత్వం చొరవ చూపుతోందన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పురుషోత్తం నాయక్, యస్దానీ, ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, వైస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గణపతిరెడ్డి, డ్రిప్ రమణ స్థానిక సర్పంచ్ బుచ్చిగారి సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ నాగార్జునరెడ్డి తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ములకలచెరువు : మనిషికి డబ్బు, ఆస్తుల కంటే ప్రధానమైనది ఆరోగ్యమేనని ఎంపీపీ సాయిలీలా, సర్పంచు విష్ణువర్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సోంపల్లెలోజగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

వాల్మీకిపురం : ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని జెడ్పీటీసీ నిర్మల అన్నారు. బుధవారం మండలంలోని జర్రావారిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని 300మంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు, సర్పంచ్ మునిభాస్కర్ పాల్గొన్నారు.

కేవీపల్లె : పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపల్లె సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎంపీపల్లె గ్రామ సచివాలయం వద్ద జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలను సంపూర్ణ ఆరోగ్య వంతులను చేయడమే లక్ష్యంగా ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యంపై సర్వే చేయడం తోపాటు సమస్యలు గుర్తించిన వారికి ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

పీలేరురూరల్ : జగనన్న ఆరోగ్యసురక్ష పేద ప్రజలకు రక్ష అని మండల ప్రత్యేకాధికారి నాగరాజ అన్నారు. బుధవారం మండలంలోని బాలంవారిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 359 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అయ్యప్ప, డాక్టర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ శేషగిరిరావు, మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు అన్నారు. బుధవారం రెడ్డివారిపల్లె సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ రెడ్డెమ్మ, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు.

తంబళ్లపల్లె : గ్రామీణ నిరుపేదల పాలిట జగనన్న ఆరోగ్య సురక్ష వరం లాంటిదని స్పెషల్ ఆఫీసర్, జిల్లా అధికారి సందప్ప , సర్పంచు సుధాకర్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం గోపిదిన్నె గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష, మెడికల్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్లు అనుపమ, మునికుమార్‌లు పలువురికి పలు రకాల వైద్య పరీక్షలతో చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు.

రామసముద్రం : మండలంలోని ఎలవానెల్లూరు పంచాయతీలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది.

మదనపల్లె : ప్రజారోగ్యమే పరమావధిగా ప్రతి గడపకీ ప్రభుత్వ వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను ప్రవేశపెట్టిందని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని బసినికొండ-2 గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎంపీడీఓ భానుప్రసాద్‌తో కలిసి పరిశీలించారు.

కురబలకోట : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పైసా ఖర్చులేకుండా ప్రజల వద్దకే వచ్చిన మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపి బి. దస్తగిరి తెలిపారు. బుధవారం చింతమాకులపల్లె గ్రామ ఇన్‌చార్జి నార్లపల్లె కోళ్ల వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.